క్లుప్తంగా

కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు



చిలకలపూడి(మచిలీపట్నం): ముస్లింలకు కలెక్టర్ పి. రాజాబాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణ, దాతృత్వానికి రంజాన్ మాసం ప్రతీక అని, ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, సోదరభావం, ప్రేమను పెంపొందిస్తాయని చెప్పారు. అల్లా చూపిన మార్గంలో నడవాలని ఆయన ఆకాంక్షించారు.

ఔట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా న్యాయసేవాధికార సంస్థ మీడియేషన్ సెంటరులో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన వారు మే 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రెండు ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు భర్తీ చేయనున్నామని చెప్పారు. అభ్యర్థులు 7వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 42 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయస్సు సడలింపు ఉందన్నారు. మరిన్ని వివరాలకు కృష్ణా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునన్నారు.

లక్ష్మణబాబు మృతికి సంతాపం

గూడూరు: గూడూరు మాజీ ఎంపీపీ వార్త లక్ష్మణబాబు మృతి తీరనిలోటని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ గురువారం కప్పలదొడ్డిలోని స్వగృహంలో మృతిచెందిన వార్త లక్ష్మణబాబు భౌతిక కాయానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ సర్పంచిగా గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేశారని, మండల పరిషత్ అధ్యక్షుడిగా వెనుకబడిన వర్గాల నాయకుడిగా సమర్థవంతంగా పనిచేశారన్నారు.

చీరల పంపిణీ



పెడన: వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సౌజన్యంతో ముస్లిం మహిళలకు చీరలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పంపిణీ చేశారు. నాలుగో వార్డులోని షాదిఖానాలో జరిగిన కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ అల్లా అందరిని చల్లగా చూడాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్ బి. గంగయ్య పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ

కోడూరు: నరసింహపురం గ్రామానికి చెందిన మల్లిపెద్ది హైమావతి (94) శుక్రవారం మృతి చెందారు. మృతురాలి నేత్రాలను ఆమె కుమారుడు ప్రముఖ వైద్యుడు మల్లిపెద్ది కోటేశ్వరరావు దానం చేశారు. కార్నియాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు ప్రవీణ్ సేకరించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పెడన: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీపీ రాజులపాటి వాణితో కలిసి మండలంలోని చెన్నూరు గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు స్నేహ భావాన్ని, ఐక్యతను పెంచుతాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండవీటి నాగబాబు మాట్లాడుతూ 40 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయని చెప్పారు. రాజులపాటి అచ్యుతరావు, గుడిసేవ లక్ష్మీరాణి, బుంగా నాని, వెంకట్రామయ్య, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పూలే విగ్రహావిష్కరణ

మచిలీపట్నంటౌన్: ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాన్ని శనివారం ఉదయం 9.59 గంటలకు ఎమ్మెల్యే పేర్ని నాని ఆవిష్కరిస్తారు. విశిష్ట అతిథిగా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పాల్గొంటారు.

సమన్వయంతో పనిచేయండి

- మంత్రి జోగి రమేష్
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష



అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్షిస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ హాల్‌లో కృత్తివెన్ను మండలానికి సంబంధించి ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, అధికారులతో మండల సమస్యలపై సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను మీ స్థాయిలో పరిష్కరించగలిగేవి కూడా పెద్ద సమస్యలుగా చూపడం తగదన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

తీర ప్రాంతాల్లో నీటి సమస్యపై సంబంధిత అధికారులను మంత్రి నిలదీశారు. నీలిపూడి దళితవాడతో పాటు నీలిపూడి పంచాయతీలోని పలు గ్రామాలకు తాగునీరందని దుస్థితి ఏర్పడిందని పలువురు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. చిన్నగొల్లపాలెం, ఇంతేరు తదితర ప్రాంతాల్లో తాగునీరు పూర్తిస్థాయిలో రావడం లేదని, వాల్వు ఇష్టానుసారంగా కట్టేస్తున్నారని, పర్యవేక్షణ పూర్తి స్థాయిలో కొరవడిందని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు మంత్రికి వివరించారు. దీనిపై సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న ఏడుగురు సిబ్బందిని 12కు పెంచాలని చెప్పారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సిన ప్రాంతాలను గుర్తించి రేపటి నుంచే సరఫరా చేసేలా చూడాలని గ్రామీణ నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. విద్యుత్ లో వోల్టేజీ కారణంగా సింగిల్ మోటారు రన్ అవుతోందని, మరో మోటారుంటే నీటిని పుష్కలంగా అందించగలుగుతామని సంబంధిత కాంట్రాక్టర్ పేర్కొనడంతో విద్యుత్ శాఖాధికారులు ట్రాన్స్‌ఫార్మర్ కొత్తది వేయాల్సి ఉంటుందని, అలాగే ఎల్‌టీ నుంచి హెచ్‌టీకి మార్పు చేయాలని, ఇందుకు సుమారు రూ.6 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. గ్రామీణ నీటి పారుదల శాఖ నుంచి నిర్వహణ ఖర్చుల నిధులు రూ.6 లక్షలు విడుదల చేస్తామన్నారు. విద్యుత్ ఎప్పుడు, ఎక్కడ, ఏ ప్రాంతంలో తీస్తున్నారు అనే విషయాన్ని ముందుగా గ్రామాల్లో తెలియజేయాలని, గృహాలకు మాత్రం నిరంతరం సరఫరా చేయాలని మంత్రి విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు.

జగనన్న లే అవుట్లలో అంతర్గత రోడ్లకు రూ.1.56 కోట్లు మంజూరు..

హౌసింగ్‌కు సంబంధించి మండలంలో 19 జగనన్న లే అవుట్లలో 13 లే అవుట్లకు సంబంధించి 19 అంతర్గత రోడ్లు మంజూరయ్యాయని, ఇందుకు రూ.1.56 కోట్లు విడుదల అయ్యాయని చెప్పారు. ఆర్చ్ నిర్మాణానికి రూ.4.15 లక్షలు మంజూరయ్యాయని మంత్రి వివరించారు. ఇంతేరులో 2010లో ఇచ్చిన వ్యవసాయ భూములకు టైటిల్ డీడ్‌లు ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రభుత్వ అసైన్‌మెంట్ భూములను ఎవరికైతే కేటాయించామో వారికి నోటీసులు ఇవ్వాలని, ఆ నోటీసులకు సమాధానాలు రాకపోతే రెండోసారి కూడా నోటీసులు జారీ చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఆ భూములలో ఎవరైతే ఉన్నారో వారికి పట్టాలు ఇచ్చేందుకు విచారణ చేయాలని సూచించారు. వ్యవసాయం, ఇరిగేషన్, పోలీస్, విద్యా శాఖ, వెలుగు తదితర వాటిపై పూర్తిస్థాయిలో సమీక్షించారు. సమావేశంలో జోగి రాజీవ్, జెడ్పీటీసీ రత్నకుమారి, బంటుమిల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకట్రాజు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ స్రవంతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొల్లు రవీంద్ర దౌర్జన్యకాండ

- మట్టి ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడి చేసి తాళం లాక్కున్న వైనం
- వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ శ్రేణుల దౌర్జన్యం

మచిలీపట్నంటౌన్: మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మరోసారి దౌర్జన్యకాండకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం నగరంలోని కాలేఖాన్‌పేటలో మట్టితో వస్తున్న ట్రాక్టర్‌కు కారును అడ్డం పెట్టి అడ్డుకున్నారు. సొంత పార్టీకి చెందిన నాయకుడు శివగంగ డ్రెయిన్ కట్టను తవ్వి మట్టిని అమ్ముకుంటున్నా కొల్లు రవీంద్ర స్పందించలేదు. వైఎస్సార్ సీపీ నాయకులు శారదా నగర్‌లోని మంగలేరు చెరువును లీజుకు తీసుకుని అభివృద్ధి చేస్తున్నారు. ఈ దశలో అక్కడి మెరక మట్టిని ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఈ మట్టిని తీసుకువస్తున్న ట్రాక్టర్‌ను కాలేఖాన్‌పేటలో కొల్లు రవీంద్ర అడ్డుకుని తాళం లాక్కుని ట్రాక్టర్ డ్రైవర్ సోనీబాబుపై చేయి చేసుకున్నాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మంగలేరులో మట్టిని ఈ ప్రాంత వైఎస్సార్ సీపీ నాయకులు దోచుకుంటున్నారంటూ తీవ్ర పదజాలంతో దుర్భాషలాడాడు. విషయం తెలుసుకున్న ఆ ప్రాంత వైఎస్సార్ సీపీ నాయకుడు, శివగంగ పీఏసీఎస్ అధ్యక్షుడు కోసూరి వెంకట్రామయ్య(ముసలయ్య), మాజీ కౌన్సిలర్ కోసూరి వెంకట నాంచారయ్య ఘటనా స్థలానికి చేరుకుని తమను దుర్భాషలాడటం సబబుకాదని కొల్లు రవీంద్రను ప్రశ్నించారు. టీడీపీకి చెందిన పిప్పళ్ల వెంకట కాంతారావు (వెంకన్న), వడ్లమూడి సుబ్బారావు, సుంకర చిన్ని, గోపు సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్, ఆ పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తాము మంగలేరును చేపలసాగుకు లీజుకు తీసుకుని అభివృద్ధి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ నాయకులు చెప్పినప్పటికీ కొల్లు రవీంద్ర వాగ్వాదానికి దిగడం గమనార్హం. మట్టితో వెళుతున్న తమ ట్రాక్టర్‌ను ఆపడం సరైన పద్ధతి కాదని, ఏమైనా ఉంటే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని ముసలయ్య కొల్లు రవీంద్రకు సూచించారు. టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ మంగలేరు ప్రాంతంలో ఫ్యాక్టరీ నిర్మాణ సమయంలో అడ్డగోలుగా మట్టి తవ్వుకుని మెరక చేసుకున్నప్పుడు ఎందుకు స్పందించలేదని కొల్లు రవీంద్రను ప్రశ్నించారు.

టీడీపీ నేత వెంకన్న డ్రెయిన్ గట్టు మట్టి అమ్ముకుంటుంటే పట్టదా?

టీడీపీ నగర నాయకుడు పిప్పళ్ల వెంకన్న శివగంగ డ్రెయిన్ గట్టును తవ్వి మట్టిని అమ్ముకుంటుంటే పట్టించుకోని కొల్లు రవీంద్ర చెరువు అభివృద్ధి పనుల మట్టి తోలకాన్ని అడ్డుకోవడం ఎంత వరకు సబబు అని వైఎస్సార్ సీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. సొంత పార్టీకి చెందిన నాయకులు ఏ తప్పు చేసినా వెనుకేసుకొస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు చేస్తున్న అభివృద్ధి పనులను తప్పుగా చూపించడం కొల్లు రవీంద్రకు తగదంటున్నారు.

రంజాన్ ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా



విద్యుత్ దీపాల వెలుగులో బుట్టాయిపేటలోని మసీదు

మచిలీపట్నంటౌన్: పవిత్ర రంజాన్ ప్రార్థనలు నిర్వహించేందుకు నగరంలోని ముస్తాఖాన్‌పేట వద్ద ఉన్న ఈద్గా సిద్ధమైంది. ఈద్గా వద్ద నగరంలోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈద్గా మైదానం పల్లంగా ఉండటంతో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక చొరవతో మెరక చేసే పనులు కొద్దిరోజులుగా నిర్వహిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా మట్టిని తీసుకువచ్చి మెరక చేశారు. ఈద్గా ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పేర్ని నాని, మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, ఈద్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీ, కార్యదర్శి అష్రఫ్‌బాషా, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ రబ్బానీ, ఎండీ మొహసిన్, షేక్ మొహమ్మద్ సాహెబ్, కరీముల్లా తదితరులు పరిశీలించారు.

ముస్తాబైన మసీదులు..

నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మసీదులు రంజాన్‌కు ముస్తాబయ్యాయి. మసీదులకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంజాన్ సందర్భంగా శనివారం ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. నగరంలోని కొత్త మసీదు, బుట్టాయిపేట, సుకర్లాబాద్, మాచవరం మెట్టు, నూరీ నగర్, జామియా మసీదు, జవ్వారుపేట టిక్యా మసీదులతో పాటు ఇతర మసీదులు ముస్తాబయ్యాయి. శుక్రవారం పలు డివిజన్లలో మునిసిపల్ పారిశుధ్య కార్మికులు పరిసరాలను శుభ్రం చేసి సున్నం, బ్లీచింగ్ చల్లారు. మసీదులు, ముస్తాఖాన్‌పేటలోని ఈద్గా వద్ద తాగునీరు, లైటింగ్ ఏర్పాట్లను నగర పాలక సంస్థ చేపట్టింది.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు పేర్ని, కైలే



కలెక్టర్ రాజాబాబుకు పూలమొక్క అందజేస్తున్న పేర్ని నాని, కైలే అనిల్‌కుమార్

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి. రాజాబాబును బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శుక్రవారం ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం వీరు ఆయా నియోజకవర్గాల పరిధిలోని సమస్యలపై చర్చించారు.

- కలెక్టర్ పి. రాజాబాబును ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ సంఘ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు, నాయకులు ఎ. నాగరాజు, మేడేపల్లి సుబ్బారావు, మద్దాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణం వేగవంతం చేయండి

కలెక్టర్ పి. రాజాబాబు



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే పేర్ని నాని

కోనేరుసెంటర్: మచిలీపట్నం మెడికల్ కళాశాల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)తో కలిసి మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. విద్యుత్, తాగునీటి సరఫరా పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ మెడికల్ కళాశాల ఏడు నియోజకవర్గాలకు తలమానికంగా మారుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రెండేళ్ల వ్యవధిలో మెడికల్ కళాశాల ఆధునిక హంగులతో సర్వాంగ సుందరంగా తయారవుతోందని వివరించారు. బందరు ఆర్డీఓ ఐ. కిషోర్, తహసీల్దార్ డి. సునీల్‌బాబు, ఇంజినీరింగ్ ఇన్ఫ్రా లిమిటెడ్ సైట్ ఇంజినీర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చేసిన మేలును మరువలేం

'జగనన్నే మా భవిష్యత్తు'లో ప్రజలు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కుటుంబాలకు చేస్తున్న మేలును ఎప్పటికీ మరిచిపోలేమని 46వ డివిజన్ ప్రజలు పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు సత్తెనపల్లి శ్రీనివాసరావు, జగన్, గృహ సారథుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ పాలన ఎలా ఉందని పార్టీ నాయకులు పలువురిని ప్రశ్నించగా అద్భుతంగా ఉందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలతో తమ కుటుంబ జీవనం మెరుగుపడిందని పలువురు మహిళలు వివరించారు. నగరంలోని పలు డివిజన్లలో ఈ కార్యక్రమాన్ని ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, కన్వీనర్లు, గృహ సారథుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

బంటుమిల్లి: లక్ష్మీనారాయణపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ వి. చినబాబు వలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాలనపైన వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ కన్వీనరు ఎర్రబ్బాయి, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నూతన కమిటీ ఎన్నిక

కోనేరుసెంటర్: మచిలీపట్నం నియోజకవర్గం క్రైస్తవ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మల్లెల భాస్కర్‌కుమార్ ఎన్నికయ్యారని జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, ప్రధాన కార్యదర్శి విక్టర్‌పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా కొడాలి ఇలిషా, బందరు మండలం వెస్ట్ అధ్యక్షుడిగా ఉప్పులేటి సురేష్‌బాబు, ఈస్ట్ అధ్యక్షుడిగా అబ్బూరి యోహాను ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా కలపాల అనుపమ, కార్యదర్శిగా కోన డానియేల్ నియమితులయ్యారు.

స్వామివారికి వెండి బిందె సమర్పణ

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి విజయవాడకు చెందిన భక్తులు మాదల ఈశ్వర వరప్రసాద్, పార్వతీదేవి దంపతులు ఒక కిలో 20 గ్రాముల వెండి బిందె బహూకరించారు. శుక్రవారం ఉదయం స్వామివార్లను దర్శించుకున్న వరప్రసాద్ దంపతులు ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావుకు వెండి బిందెను అందచేశారు.

అంబటి బ్రాహ్మణయ్యకు నివాళి



వైఎస్సార్ సీపీ అవనిగడ్డ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

అవనిగడ్డ: మాజీ ఎంపీ అంబటి బ్రాహ్మణయ్య నైతిక విలువలు, విశ్వసనీయత కలిగిన నాయకుడని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం బ్రాహ్మణయ్య వర్థంతి కార్యక్రమం జరిగింది. బ్రాహ్మణయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే రమేష్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

- నాగాయలంక: స్థానిక పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో అంబటి బ్రాహ్మణయ్య విగ్రహానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. బ్రాహ్మణయ్య తనయుడు, అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరిప్రసాద్ (హరిబాబు) మాట్లాడుతూ తన తండ్రి సేవలకు గుర్తింపునిస్తూ కోడూరు మండలం ఉల్లిపాలెం-భవానీపురం వారధికి బ్రాహ్మణయ్య పేరుతో ఉత్తర్వులు ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు కృతజ్ఞతలు తెలిపారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

విసిగిపోయాం..టీడీపీకి రాజీనామా చేస్తాం

టీడీపీ గ్రామ అధ్యక్షుడు రవీంద్రనాథ్ ఠాగూర్

కె. కొత్తపాలెం(మోపిదేవి): టీడీపీ ఆవిర్భావం నుంచి అంటిపెట్టుకున్నామని, మండల కమిటీ కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోనందున త్వరలో పార్టీకి రాజీనామా చేయనున్నామని ఆ పార్టీ గ్రామ అధ్యక్షులు దుట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, నీటి సంఘాల మాజీ అధ్యక్షులు మత్తి నాగమల్లేశ్వరరావు తెలిపారు. గ్రామ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. పార్టీలో ప్రారంభం నుంచి కొనసాగుతున్నామని, ప్రతి ఎన్నికల్లోనూ సొంత నిధులు ఖర్చుపెట్టి ఆర్థికంగానూ నష్టపోయామని విచారం వ్యక్తంచేశారు. మండల కమిటీ ఒంటెత్తు పోకడలకు విసిగిపోయామని, ఈ విషయం అనేక సార్లు మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు, జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, రావి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పారు. సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి రెండేళ్ల పాటు గ్రామంలో టీడీపీకి దూరంగా ఉంటూ ఒక్క సమావేశానికి కూడా హాజరు కాలేదని విమర్శించారు.

అలాంటి సర్పంచ్‌ను మండల కమిటీ వెంటేసుకుని ప్రభుత్వం, గ్రామ కార్యదర్శిపై ఆందోళనలు చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ బూత్ కమిటీ సభ్యులు మాతంగి రత్నబాబు, మల్లవోలు రమేష్, మత్తి ఫణికుమార్, మత్తి రఘు, లక్ష్మీ పెరుమాళ్లు, బచ్చు వెంకట రామారావు, కొక్కిలిగడ్డ హనుమంతరావు, బాబూరావు, రాజులపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు రిమాండ్

బంటుమిల్లి: అర్తమూరు పంచాయతీ శివారు శాంతి నగర్ గ్రామానికి చెందిన మహిళ ఆత్మహత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఎస్ఐ పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన బోయిన లక్ష్మీశివ పార్వతి భర్త వేరే మహిళతో సహజీవనం చేయడంతో మనస్తాపం చెంది ఈ నెల 18న ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు అనంతరం మృతురాలి భర్త నాగఫణీంద్రను, సహజీవనం చేస్తున్న మహిళను అరెస్ట్ చేసి మచిలీపట్నం సివిల్ జడ్జి ముందు హాజరు పరిచారు. న్యాయమూర్తి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు.

హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ పరిశీలన

చల్లపల్లి: అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు స్థానిక పడమర వైపు ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఆరోగ్య ఉప కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వైభవంగా గంగాభవానీ అమ్మవారి నెల జాతర



కోడూరు: భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారి నెల జాతర శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం అమ్మవారి ప్రధాన గుడి సంబరం నిర్వహించిన నెల రోజులకు మళ్లీ జాతర నిర్వహించారు. ఉదయం ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులను సమర్పించారు. డప్పువాయిద్యాల నడుమ గ్రామ మహిళలు నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. మెడలో గారెలు దండలు ధరించి చలువ బట్టలపై వచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. అమ్మవారి మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. ధర్మకర్త యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే సింహాద్రి ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


చల్లపల్లి: రంజాన్ సందర్భంగా ముస్లింలకు అవనిగడ్డ ఎమ్మెల్యే శుక్రవారం సాయంత్రం స్థానిక జామియా మస్జీదులో ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం ముస్లింలకు ఈదుల్ ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నసీంఘోరీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

ఇస్లాంనగర్‌లో గ్రామ సచివాలయం-4 వద్ద నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పంపిణీ చేశారు. అడపా రాంబాబు, అడపా గురవయ్య ఆర్థిక సహకారం అందించారు.

తల్లిదండ్రులను భాగస్వాములను చేయండి

డీఈఓ తాహెరా సుల్తానా



మచిలీపట్నంటౌన్: పాఠశాలల్లో జరిగే ప్రతి కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. పాఠశాలల సామాజిక తనిఖీ, పాఠశాలల పర్ఫార్మెన్స్ తదితర అంశాలపై మునిసిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం రుస్తుంబాద బాలికోన్నత (పార్కు) పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ ఎవాల్యూయేషన్ టూల్‌లో సర్వే రిపోర్టును యాప్‌లో పూరించే క్రమం లో పాఠశాలలో ఉన్న వసతులు అన్నింటిని నమోదు చేయాలన్నారు. నాడు - నేడు పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు హెచ్‌ఎంలు శ్రద్ధ వహించాలని సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎ. శేఖర్ సూచించారు. ఎంఈఓ ఎంవీఎస్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మోపిదేవి: పెదకళ్లేపల్లిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ పద్మావతి శుక్రవారం తెలిపారు. పెదకళ్లేపల్లి-5 లో జనరల్ కేటగిరి, పెదకళ్లేపల్లి-6లోఎస్సీ కేటగిరికి కేటాయించామన్నారు. అర్హతగల వారు దరఖాస్తు ఫారాలు రెండు సెట్లు పూర్తి చేసి మే 1వ తేదీలోగా స్వయంగా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం కార్యాలయం, ఐసీడీఎస్ ప్రాజెక్టు అవనిగడ్డలో అందజేయాలన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు నాంది పలికిందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక కోట రాఘవయ్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యాసంస్థల్లో చదివి ఉన్నత స్థితికి చేరిన పలువురు విద్యార్థులను, తల్లిదండ్రులను సత్కరించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, విద్యా సంస్థల గౌరవ సలహాదారు కోట వెంకటసుబ్బారావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీటీసీ గంగాధరరావు పాల్గొన్నారు.